రెండో రోజూ అవే అవస్థలు

- చంద్రబాబు కలిగించిన ఆటంకానికి తల్లడిల్లిన పేద గుండెలు
- ఇబ్బందులు పడుతూ సచివాలయానికి పింఛనుదారులు

తగరపువలస : గత ఎన్నికల్లో ఓడించిన ప్రజలపై చంద్రబాబు ఇప్పటికీ కారాలు, మిరియాలు నూరుతూనే ఉన్నాడు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేరువకావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు. 2024 ఎన్నికలు ప్రారంభం కావడంతో తన పగను ఆయుధంగా మలచుకున్నాడు. వలంటీర్లు లేకుండా పెన్షన్ పంపిణీ చేయించాలని తన అనుచరులతో కోర్టులో కేసులు వేయించాడు. ఫలితంగా రెండు రోజులపాటు పెన్షనర్లు తల్లడిల్లిపోయారు.


బొగ్గురోడ్డు సచివాలయంలో రామలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వీఆర్వో రాము


పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

బుధవారం నుంచి పెన్షన్లు పంపిణీ కావడంతో ఎండనపడి రొప్పుతూ వృద్ధులు, దివ్యాంగులు సచివాలయాల వద్దకు చేరుకున్నారు. గురువారం నుంచి ప్రభుత్వ సిబ్బంది కూడా సజావుగా పంపిణీ చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. చంద్రబాబు కలిగించిన ఆటంకానికి పేదగుండెలు తట్టుకోలేకపోయాయి. రెండు రోజులపాటు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇంటి వద్దకే వలంటీర్ల ద్వారా ఒకటో తేదీ ఉదయాన్నే పెన్షన్ అందించిన వారికే ఓటు వేస్తామని పెన్షనర్లు ముక్త కంఠంతో చెబుతున్నారు.

రెండో రోజూ అష్టకష్టాలు

ఆనందపురం : సామాజిక పింఛన్ల లబ్ధిదారులు రెండో రోజూ అష్టకష్టాలు పడ్డారు. అధికారులు రెండో రోజు పింఛన్ల పంపిణీని కొనసాగించారు. అయితే సచివాలయాలకు మూకుమ్మడిగా పింఛనుదారులు


మంచం మీద ఉన్న అప్పలరాజుకి పింఛన్ అందజేస్తున్న సచివాలయ కార్యదర్శి

రావడంతో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. వలంటీర్లు క్లస్టర్ల వారీగా గంటలోపే లబ్ధిదారులకు పింఛన్లను అందించేవారు. అయితే చంద్రబాబు కుట్ర వల్ల వలంటీర్లను విధుల నుంచి తప్పించడంతో సచివాలయాల పరిధిలో పింఛన్ల పంపిణీ స్తంభించిపోయింది. అధికారులకు బాధ్యత అప్పగించి.. వందలాది మందికి ఒకేచోట అందించాల్సి రావడంతో గందరగోళంగా ఉంటోంది. ఎండ వేడిమికి తట్టుకోలేక చాలా మంది వృద్ధులు అవసోపాలు పడ్డారు. అయినా అధికారులు చురుగ్గా పని చేస్తుండడంతో మండంలోని 18 సచివాలయాల పరిధిలో 8,892 మంది లబ్ధిదారులు ఉండగా 90 శాతం పంపిణీ చేశారు. వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెంలో పింఛన్ల పంపిణీని డీఎల్‌డీవో లక్ష్మీపతి పరిశీలించారు. ఎంపీడీవో ఎస్.అప్పలనాయుడు, కార్యదర్శి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.


ఆస్పత్రిలో పింఛన్ అందిస్తున్న సచివాలయ కార్యదర్శి

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

మధురవాడ : ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా సచివాలయ కార్యదర్శులు మంచం మీద ఉన్న వారికి ఇళ్లకు వెళ్లి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఆస్పత్రికి వెళ్లి మరీ అందజేస్తున్నారు. గురువారం సాయంత్రం 75వ నంబరు వార్డు సచివాలయం పరిధిలో ములగాడ పద్మ స్థానిక గాయత్రి ఆస్పత్రిలో కిడ్నీ చికిత్స పొందుతుండగా అక్కడకి వెళ్లి పింఛన్ అందజేశారు. అలాగే 78వ వార్డు సచివాలయం పరిధిలో బోని అప్పలరాజు ఇంటికి వెళ్లి పింఛన్ అందజేశారు.

చంద్రబాబు కుట్రతోనే మాకీ ఇబ్బందులు



ఆనందపురం మండలం, శొంఠ్యాం గ్రామం మాది. ప్రమాదంలో కుడికాలు పోగొట్టుకున్నాను. నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలి పని చేసుకోవడానికి కూడా వీలులేని పరిస్థితి. దీంతో ఇంటికే పరిమితమయ్యాను. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన వెంటనే దివ్యాంగ పింఛను మంజూరు చేసి ఆదుకున్నారు. కాలు లేకపోవడంతో ఎక్కడికి వెళ్లాలన్నా, కాలకృత్యాలు తీర్చుకోవాలన్నా చేతి కర్రలు పట్టుకొని వెళ్లాల్సి వస్తోంది. వలంటీర్లు తెల్లవారే ఇంటికే వచ్చి పింఛను అందించడంతో ఎంతో సౌలభ్యంగా ఉండేది. ప్రస్తుతం వలంటీర్లను విధుల నుంచి తప్పించి సచివాలయానికి వచ్చి పింఛను మొత్తం తీసుకోవాలని చెప్పారు. దీంతో చేతి కర్రలు ఊతతో ఎండలో ఉసూరుమంటూ సచివాలయానికి వెళ్లాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీరు వ్యవస్థను ప్రవేశ పెట్టి పింఛన్లను ఇంటికే అందించే ఏర్పాటు చేశారు. చంద్రబాబునాయుడు స్వార్థ రాజకీయం కోసం వలంటీర్లపై దుష్ప్రచారం చేయడం మంచిది కాదు. వలంటీర్ల ద్వారానే పింఛన్లు అందించాలి.

– చింతల చిన్నారావు, దివ్యాంగుడు

ఆటో కట్టించుకుని వచ్చా



నేను పోలియో బాధితురాలిని. చంద్రబాబు చేసిన పనికి నేను చిట్టివలస కార్మికవాడ నుంచి బొగ్గురోడ్డు సచివాలయానికి ఆటోపై రావాల్సి వచ్చింది. నాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే పెన్షన్ వచ్చింది. అమ్మఒడి, నా కుమారునికి ట్యాబ్ వచ్చింది. ఇంటి గుమ్మం ముందుకు పెన్షన్ తెచ్చి ఇచ్చే ప్రభుతానికే నా ఓటు.

– కంటిపిల్లి దేవి, చిట్టివలస

వలంటీర్ లేక ఇబ్బంది పడ్డాం



వైఎస్సార్ పెన్షన్ కానుకతోపాటు సంక్షేమ పథకాలు అన్నీ వలంటీరే ఇంటికి వచ్చి అందజేసేవారు. పెన్షన్, రేషన్ ఇంటి ముందుకే అందించేవారు. ఇప్పుడు అర్ధాంతరంగా చంద్రబాబు కుట్ర పన్ని వలంటీర్లను సేవలకు దూరం చేయడంతో కొంత ఇబ్బంది పడ్డాం. మాకు ప్రభుత్వం నుంచి పెన్షన్‌తోపాటు ఇంటి స్థలం, చేయూత సాయం రూ.75వేలు కూడా అందింది.

– భీమవరపు మాలతి, కొత్తపేట

చంద్రబాబు వల్లే వృద్ధులకు కష్టాలు



టీడీపీ, చంద్రబాబు చర్యలతో నాలుగు రోజులపాటు వృద్ధులను హింస పెట్టారు. వృద్ధులకు, దివ్యాంగులకు మేలు చేయాల్సిందిపోయి... తన అనుచరులతో కోర్టులో కేసులు వేయించిన చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది. ఐదేళ్లపాటు మూడో కంటికి తెలియకుండా వలంటీర్లు చక్కగా పెన్షన్లు పంపిణీ చేశారు. ఇప్పుడు చంద్రబాబు వల్ల అవస్థలు పడ్డాం.

– అడ్డగర్ల పద్మ, తగరపువలస

మమ్మల్ని ఏడపించొద్దు బాబు



ఈ వయసులో ప్రతిపక్షాలు, చంద్రబాబు కలిసి మమ్మల్ని ఏడిపించవద్దు. మేము కన్నీరు పెడితే అందుకు కారణమైన వారికి పాపం తగులుతుంది. జీవీఎంసీ, పంచాయతీ ఎన్నికల సమయంలో కూడా వలంటీర్లు పెన్షన్లు అందించారు. ఇప్పుడు చంద్రబాబు కుట్రతో వారు సేవకు దూరమయ్యారు. మాలాంటి వారిమి నరకయాతన అనుభవించాం.

– గుడే పైడమ్మ, కార్మికవాడ

ప్రజల సమస్యలన్నీ పరిష్కరించా

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


శివశక్తినగర్ రోడ్డులో కరపత్రం అందజేసి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మధురవాడ: నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు తనవిగా భావించి పరిష్కరించానని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 5వ వార్డు బొట్టవానిపాలెం పరిసర ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం హామీలన్నీ అమలు చేసిందని, అందుకే ధైర్యంగా ఓటు అడుగుతున్నామని, భవిష్యత్‌లో కూడా ఇలానే పనిచేస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో రోడ్లు, కాల్వల సమస్యలు తన దృష్టికి తెచ్చిన వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేశామన్నారు. ఇంకా ఇక్కడ ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే విశాఖకు రాజధాని వచ్చి, ఈ ప్రాంతం మరింత శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

ఎన్నికలు దగ్గర పడడంతో టీడీపీ నాయకులు మాయ మాటలు చెప్పడానికి వస్తారని, వారి మాటలు నమ్మొద్దని, ప్రలోభాలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు హారతులు ఇచ్చి సాదరంగా స్వాగతం పలికారు. తనతోపాటు, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతిన హనుమంతురావు, వంకాయల మారుతీప్రసాద్, పోతిన సురేష్, మగడ రమణ, ఎస్.బాబ్జి, బండారు శివలక్ష్మి, వంకర అప్పారావు, ఎస్.శ్రీనివాసరావు, రుషికేష్, కూన రమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఆరోగ్యంపై అవగాహన అవసరం

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థుల ఆరోగ్యంపై అవగాహన కలిగించారు. ఆశావర్కర్ మాదాబత్తుల స్వాతి విద్యార్థులకు ఐరన్, ఫోలిక్ మాత్రలు పంపిణీ చేశారు. కోడిగుడ్లు, పండ్లు, తాజా కాయగూరలు ఆహారంలో తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక పాల్గొన్నారు.

మత్స్యకారులకు వలల మెటీరియల్ పంపిణీ


మత్స్యకారులకు వలల మెటీరియల్ అందిస్తున్న దివీస్ ప్రతినిధులు

తగరపువలస : భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం, అన్నవరం పంచాయతీల్లో మత్స్యకారులకు గురువారం దివీస్ లేబొరేటరీ యాజమాన్యం రూ.5.20 లక్షల విలువైన వలల మెటీరియల్ అందించింది. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డి.సురేష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, కె.నరసింహ పాల్గొన్నారు. వీరు మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు సహాయార్థం దివీస్ లేబొరేటరీ యాజమాన్యం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. దీనిని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణికి గాయాలు

పద్మనాభం : మండలంలోని చిన్నాపురం కూడలి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా గజపతినగరానికి చెందిన ఆర్.వెంకటలక్ష్మి అనే నాలుగు నెలల గర్భిణి గాయపడింది. ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చుని విశాఖ నుంచి గజపతినగరం వెళ్తున్న ఈమెను వెనుక నుంచి స్కూటీపై వేగంగా వచ్చిన ముగ్గురు యువకులు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వెంకటలక్ష్మి తలకు అంతర్గత గాయాలయ్యాయి. పద్మనాభం పోలీసులు విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లపై పశువులతో ప్రమాదాలు


కొమ్మాది వైఎస్సార్ నగర్ కాలనీ రహదారిపై పశువులు

తగరపువలస : జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది వైఎస్సార్ నగర్ రహదారిపై నిత్యం పదుల సంఖ్యలో పశువులు తిష్ట వేస్తున్నాయి. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలపైకి కొమ్ములు విసరడం, రోడ్డు మధ్యలో పోట్లాట కారణంగా ఈ మార్గంలో ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులను కుటుంబ సభ్యులు ఒంటరిగా పంపించలేకపోతున్నారు. జీవీఎంసీ అధికారులు జోక్యం చేసుకుని రహదారులపై పశువుల సంచారం లేకుండా చర్యలు తీసుకోవాలని మధురవాడ జోన్ ప్రజలు కోరుతున్నారు.

ఎలక్ట్రానిక్ వస్తువుల చోరీ

పీఎం పాలెం : క్రికెట్ స్టేడియం సమీపంలోని గొడౌన్‌లో జరిగిన చోరీపై పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... క్రికెట్ స్టేడియం వెనుక భాగంలో పీఎం పాలెం సుందర్ నగర్‌లో రిలయన్స్ గొడౌన్ ఉంది. ఈ నెల 3న హౌస్ కీపింగ్‌కు వచ్చిన మహిళ గొడౌన్‌కు రంధ్రం వున్నట్లు గమినించింది. వెంటనే పరిశీలించగా గొడౌన్‌లోని 8 ల్యాప్‌టాప్‌లు, 3 ఆపిల్ కంపెనీ అడాప్టర్లు, మూడు మొబైల్ ఫోన్లు పోయినట్టు గుర్తించారు. సంఘటనపై సంస్థ ప్రతినిధి యల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వై.రామకృష్ణ తెలిపారు.

మద్యంతో ఇద్దరు అరెస్ట్

పీఎం పాలెం: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పీఎం పాలెం పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. మధురవాడ శివశక్తి నగర్ నాగ దుర్గమ్మ దేవాలయం సమీపంలో బుచ్చయ్య (65) అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా బోయిపాలెంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న ఎం.నరసింహులు (45)ను అరెస్ట్ చేశారు. వారిద్దరి నుంచి 38 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

పరిపాలన రాజధానితో ఉత్తరాంధ్ర సస్యశ్యామలం


పాట్నూరులో కిరాణా షాపు వద్ద మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం : విశాఖపట్నం పరిపాలన రాజధాని కావడంతో ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, సస్యశ్యామలమవుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాట్నూరులో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే విశాఖపట్నం నుంచి పరిపాలన సాగిస్తారన్నారు. విశాఖపట్నం పరిపాలన రాజధాని కావడంతో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయన్నారు. భూముల విలువ రెట్టింపు అవుతుందన్నారు. చంద్రబాబు పొరపాటున సీఎం అయితే రాజధానిగా అమరావతిని చేస్తారన్నారు. సచివాలయ వ్యవస్థను రద్దు చేసి, సంక్షేమ పథకాలు ఆపేసి పేదలను ఇబ్బంది పెడతారన్నారు. పింఛన్లు పంపిణీ చేసే విధుల నుంచి వలంటీర్లను తప్పించడం వల్ల అవ్వాతాతల ఉసురు చంద్రబాబుకు తగులుతుందన్నారు. పింఛన్ల కోసం సచివాలయాల వద్దకు వెళ్లలేక వృద్ధులు మృతి చెందారన్నారు.

పెత్తందారులతో యుద్ధంలో పేదలదే విజయం

సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోరుకునే వ్యక్తి అని... చంద్రబాబు డబ్బున్న వారి సంక్షేమం కోరే వ్యక్తి అని ముత్తంశెట్టి అన్నారు. పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం జరుగుతోందన్నారు. ఈ యుద్ధంలో పేదలు గెలవాలంటే అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కరోనా వంటి కష్టకాలంలోనూ పథకాలు అమలు చేసిన మనసున్న నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ఆధునికీకరించి మెరుగైన విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టామన్నారు. పాట్నూరులో అభివృద్ధి, సంక్షేమానికి రూ.24 కోట్లు ఖర్చు చేశామన్నారు. నిత్యం అందుబాటులో వుండే తనను, ఫోన్ చేస్తే స్పందించి సమస్యలు పరిష్కరించే బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. భూ కబ్జాలకు పాల్పడే గంటా శ్రీనివాసరావు రియల్ ఎస్టేట్ వ్యాపారులను మాత్రమే బాగా చూసుకుంటారన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరబాబు మాట్లాడుతూ గంటా శ్రీనివాసరావు కళ్లద్దాలు తగిలించుకుని గాలిలో తిరగడం తప్ప ప్రజలను పట్టించుకోరన్నారు. బ్యాంకు నుంచి రూ.360 కోట్ల రుణం తీసుకుని చెల్లించకపోవడంతో గంటా శ్రీనివాసరావుకు చెందిన పద్మనాభం మండలంలోని 16 ఎకరాల భూమిని అధికారులు త్వరలో వేలం వేస్తారన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు మాట్లాడుతూ గంటా శ్రీనివాసరావు మంత్రిగా ఉన్నప్పుడు ఎలక్ట్రికల్, దేవాదాయ శాఖలోని పోస్టులను అమ్ముకున్నారని ఆరోపించారు. ప్రచారంలో పాట్నూరు ఎంపీటీసీ సభ్యురాలు తోనంగి దివ్య, వైఎస్సార్ సీపీ నాయకులు బేపల గురునాయుడు, బూసురోతు అప్పారావు, తోనంగి అప్పలనాయుడు, బేపల బంగారునాయుడు, ఈర్ల ఈశ్వరరావు, తాలాడ పద్మనాభం, పల్లంటి చిన్నారావు, బుగత సత్యనారాయణ, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ

ఆనందపురం : భీమిలి నియోజకవర్గంలోని ఆనందపురం, భీమిలి, పద్మనాభం కస్తూర్బా గాంధీ బాలికల ఆవాస విద్యాలయాల (కేజీబీవీ) ఉపాధ్యాయులకు స్థానిక కేజీబీవీలో గురువారం ఒక రోజు డిజిటల్ బోధనపై శిక్షణ అందించారు. జిల్లా నోడల్ అధికారి జి.సత్యమహేశ్వర రావు, కోర్సు డైరెక్టర్, భీమిలి డైట్ లెక్చరర్ గొట్టేటి రవి కలిసి ఉపాధ్యాయులకు టోఫెల్, ఈ – పాఠశాల, బైజూస్ బోధన విధానాలు ప్రత్యక్షంగా ఉపయోగించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా డిజిటల్ విధానం మన రాష్ట్రంలోనే వుందన్నారు. వాటిని తరగతి గదిలో వినియోగించి విద్యార్థులకు ఉత్తమమైన తర్ఫీదునివ్వాలని సూచించారు. డిజిటల్ బోధనా వినియోగ వివరాలు రాష్ట్ర స్థాయిలో డాష్‌బోర్డులో నమోదవుతాయని వివరించారు.

మహిళతో అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

మధురవాడ : ఓ మహిళ పట్ల అనుచితంగా ప్రవర్తించి, దాడి చేసిన వినయ్ అనే వ్యక్తిపై పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మాదికి చెందిన కాకర ప్రశాంతి (20) కొమ్మాదిలో నివసిస్తున్నారు. ఆమె ప్రతిభ టైలరింగ్ దుకాణంలో పనిచేస్తుంది. ఈమె హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సమయంలో వినయ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు అప్పట్లో మందలించారు. తర్వాత చదువుకు స్వస్తి చెప్పి టైలరింగ్ షాపులో పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం టైలరింగ్ షాపు వద్దకు వినయ్ వచ్చి తనతో మాట్లాడాలని డిమాండ్ చేశాడు. అందుకు ప్రశాంతి నిరాకరించడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తి చేసి... తోసేసి కొట్టినట్టు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజల కోసం పనిచేసే ముత్తంశెట్టినే గెలిపిద్దాం


వుడా కాలనీలో మహిళలకు కరపత్రం అందజేసి ఓటు అడుగుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


నమ్మివానిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: ఎన్నికల ప్రచారం ఊపందు కోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆయా అపార్ట్‌మెంట్, కాలనీ వాసులు సాదర స్వాగతం పలుకుతున్నారు. గురువారం జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ పరిసర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృతంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీవీ ఓజోన్ పరిసర ప్రాంతాల వాసులు ఇక్కడ సుమారు రూ.1 కోటితో భారీ మురుగునీటి కాల్వ నిర్మాణంతోపాటు పలు అభివృద్ధి పనులు చేపట్టినందుకు కాలనీ వాసులు పుష్పవతి, పీఎస్‌రావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటామని, ప్రజల కోసం పనిచేసే ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, మగ్గూరి వెంకటరావు, పోతిన శేషుబాబు, జగ్గుపిల్లి నరేష్, కె.శ్రీదేవి, పిల్లా రమణ, బంగారు ప్రకాశ్, పిల్లా బెల్లాపు పాపారావు, పసుపులేటి గోపి, తమ్మినేని వరలక్ష్మి, ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

నమ్మివానిపేటలో వైఎస్సార్‌సీపీ ప్రచారం

తగరపువలస: వైఎస్సార్ సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ రెండో వార్డు నాయకులు నమ్మివానిపేటలో ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ గత ఐదేళ్లలో అమలు చేసిన సక్షేమ పథకాలు, వార్డులో జరిగిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, చిప్పాడ వెంకటేష్, బింగి హరికిరణ్ రెడ్డి, డబ్బీరు ప్రశాంతి, జగన్నాథ ఎల్లాజీ, శిల్లా వంశీరెడ్డి, నమ్మి మాధవ, చేట్ల శ్రీనివాసరెడ్డి, చేట్ల నర్సిరెడ్డి, కరగాని అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

శంభువానిపాలెం గిరిజనుల ఓట్లు ఫ్యాను గుర్తుకే

పీఎం పాలెం : అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న జీవీఎంసీ ఆరో వార్డులోని శంభువానిపాలెం గిరిజన గ్రామ ప్రజలకు ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించిన ఘనత సీఎం జగనన్న పాలనలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ ఇన్‌చార్జి గాదె రోశిరెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం బీ – 2 కాలనీ, శంభువానిపాలెంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ సమస్యలు పరిష్కరించడానికి పలుమార్లు పర్యటించిన ఏకైక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాత్రమే అని గుర్తు చేశారు.

సీఎం జగనన్న అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం స్థానికులు మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించుకుంటామని పేర్కొన్నారు. పార్టీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, కె.వరలక్ష్మి, పోతిన యల్లాజీ, సూరిబాబు, వీవీ నరసింహారావు, జామి శివకుమార్, సియ్యాద్రి కనకరాజు, అనూష, గాయత్రినగర్ అప్పారావు, పిట్టా రామకృష్ణ, ఈశ్వరరావు పాల్గొన్నారు.


శంభువానిపాలెంలో ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణంతో ఊరట

- రూ.40 లక్షలతో నిర్మాణ పనులు
- పలు గ్రామాల ప్రజలకు పొగ నుంచి ఉపశమనం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు నమ్మివానిపేట డంపింగ్‌యార్డులో సుమారు రూ.40 లక్షలతో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్) నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఇప్పటికే షెడ్డు, ప్లాట్‌ఫారం పూర్తికాగా, షెడ్డు లోపల యంత్రాలు ఏర్పాటు చేయాల్సి వుంది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో తాత్కాలికంగా స్టేషన్ నిర్మాణ పనులకు అంతరాయం ఏర్పడింది. ఇటీవల ఈ డంపింగ్‌యార్డుకు స్వీడన్ సాంకేతికతతో తయారు చేసిన వారియర్ 1200 వాహన యంత్రాన్ని తీసుకొచ్చారు. బయోమైనింగ్ ప్లాంట్లలో వినియోగించే ఈ యంత్రాన్ని ఇక్కడ మూడు నెలలపాటు ఉంచుతారు. ఈ యంత్ర స్థాపన తర్వాత డంపింగ్ యార్డులో ఇతర జేసీబీలు పనిచేయని చోట దీనిని ఉపయోగించి మొత్తం చెత్తను భూమిలో నుంచి పెకిలించి కాపులుప్పాడ జిందాల్ ప్లాంట్‌కు తరలిస్తారు.


నమ్మివానిపేట డంపింగ్ యార్డులో నిర్మించిన షెడ్డు


చెత్త క్లియర్ చేయడానికి తీసుకొచ్చిన వారియర్ 1200 వాహన యంత్రం

ఉక్కిరిబిక్కిరి నుంచి ఉపశమనం

డంపింగ్‌యార్డులో పేరుకుపోయిన చెత్త నిల్వల నుంచి ఏటా వేసవిలో మంటలు చెలరేగి చుట్టూ 5 నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో పొగ కమ్ముకుని అక్కడి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. రోజుల తరబడి పొగతో గ్రామాలు మూసుకుపోయేవి. ఈ పొగ కారణంగా నమ్మివానిపేట, వలందపేట, బ్యాంకు కాలనీ, సంగివలస, ఆదర్శనగర్, ఊళ్లపేట, ఇడదాసరిపేట, తాళ్లవలస, మామిడిపాలెం తదితర గ్రామాల ప్రజలు దగ్గు, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులతో బాధపడేవారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారంలో భాగంగా ఎప్పుడు వచ్చిన చెత్తను అప్పుడే కాపులుప్పాడ డంపింగ్‌యార్డులోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలించేందుకు ఈ గార్బేజ్ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

రోజూ 66 టన్నుల చెత్త సేకరణ

భీమిలి జోన్‌లో 21 క్లాప్ వాహనాలకు 16 వాహనాలు 1, 2, 3 వార్డుల నుంచి సగటున 35 ట్రిప్పులకు 26 టన్నుల చెత్త సేకరిస్తాయి. అలాగే రోడ్ల పక్కన డంపర్ బిన్ల నుంచి మూడు కాంపాక్ట్ వాహనాల ద్వారా మూడు ట్రిప్పులకు 25 టన్నుల చెత్తను, శివారు గ్రామాల నుంచి రెండు ట్రాక్టర్లు, ఇసుజి, మినీ వాహనం, టాటా ఏస్ వాహనాల ద్వారా 5 టన్నుల చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తుంటారు. 4వ వార్డులో ట్రాక్టర్, టాటా ఏస్, అయిదు క్లాప్ వాహనాల నుంచి 10 టన్నుల చెత్తను ఉప్పాడ పరిసరాల్లోని ఖాళీ స్థలానికి తరలిస్తారు. ప్రస్తుతం డంపింగ్‌యార్డు నుంచి జీవీఎంసీ 20 టన్నుల కెపాసిటీ కొత్త టిప్పర్ ద్వారా రోజూ రెండు ట్రిప్పులలో కాపులుప్పాడ జిందాల్ ప్లాంట్‌కు చెత్త తరలిస్తున్నారు. దిబ్బలుగా పేరుకుపోయిన చెత్త నిల్వలను కాపులుప్పాడ తరలించేందుకు ఏడాది క్రితం మార్చిలో ఆరు ప్రైవేట్ వాహనాల ద్వారా సుమారు 400 ట్రిప్పులకు గాను 5వేల టన్నుల చెత్తను తరలించిన సంగతి తెలిసిందే. గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే నమ్మివానిపేట డంపింగ్ యార్డులో చెత్త నిల్వలు పేరుకుపోకుండా ఏ రోజు వచ్చిన చెత్తను ఆ రోజే తరలించడానికి వీలవుతుంది. సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ డంపింగ్ యార్డులో కూరగాయల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువులు, వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నారు. పండ్లు, పూల మొక్కలు, ఆకుకూరలు, కూరగాయల సాగుకు స్థలాన్ని కేటాయించి చెత్త కుప్పలతో నిలయమైన యార్డును నందనవనంగా తీర్చిదిద్దారు.